
రాజా

# రాసుల్లో సౌందర్యరాశి

"ఎవరిని చూపించినా వద్దంటున్నాడు.

ఏ సంబంధం తెచ్చినా ఊహూఁ అంటున్నాడు

ఏ జాతకం తెచ్చినా సరిపోల్చి జతకుదరదు అంటున్నాడు. వాడి మనస్సులో ఏ ముందో ఆ బ్రహ్మకు తెలుసు వాడికి తెలుసు. మరో మానవ మాత్రుడికి తెలిసే అవకాశం లేదు.

చతుర్వేదీ!

నువ్వు వాడి ఆత్మీయుడివి! ఆ బాల్యమిత్రుడివి. వాడి మనస్సు కనుక్కో! మాట తెలుసుకో! మనువు కుదిరితే సమయం ఏమిటో వివరంగా తెలుసుకో వాడినో ఇంటివాడిని చేయందే నాకు శాంతీ వుండదు, సౌఖ్యమూ వుండదు"

పడక్కుర్చీలో వాలిపోయి, కళ్లు మూసుకుని తన మనోవేదనంతా చెప్పుకున్నారు విష్ణుపాదచయనులు

ఆయన ఎదురుగా కుర్చీలో వినయమంతా ఉట్టిపడేట్టు తలవాల్చుకుని మరీ కూర్చున్నాడు పరాశర చతుర్వేది. చతుర్వేది గొప్ప పండితుడు. నాలుగు వేదాలూ అతని కరతలామలకాలు అటునుంచి ఇటు ఋగ్వేదాన్నీ, ఎక్కడ పడితే అక్కడ యజుర్వేదాన్నీ, సాంగోపాంగంగా సామవేదాన్నీ, క్షుణ్ణంగా అధర్వవేదాన్నీ అప్పగించ గల మహామేధావి.

చతుర్వేదికి యాజులు సహాధ్యాయి

ఇద్దరికీ అక్షరాభ్యాసం ఒకేరోజు ఓకే చోట జరిగింది. ఆపై ప్రాధమిక విద్య యిద్దరూ ఒకే పాఠశాల్లో పూర్తిచేశారు.

ఆ తర్వాతే ఇద్దరి దారులూ వేరయినాయి

వేదం నేర్వడానికి ఒక్కో గురువు వద్దకు ఒక్కో వూరు తిరిగాడు పరాశర చతుర్వేది. పేరుకు తగ్గట్టు నాలుగువేదాలూ ఔపోసన పట్టి యిల్లు చేరాడిప్పుడు. ఎప్పుడో చిన్నప్పుడే మేనమామ కూతుర్ని వివాహమాడాడు. ఆమె ఇంకా యీడేరి అత్తారింటికి రాలేదు.

యాజులు అయిదో తరగతి పూర్తి చేసుకుని ఆపై ఉన్నత పాఠశాలల్లో

చదివి, ఆ తర్వాత కళాశాలలో, విశ్వ విద్యాలయంలో చదువు పూర్తి అయిందనిపించి స్నాతకోత్తర పట్టభద్రుడై వచ్చాడు.

అదిగో ....

అప్పుడొచ్చింది చిక్కు ......

చయనుల వారికి మనవడిని పై చదువులు చదివించి ఆపై అతడ్ని జిల్లాకే అధికారిని చేయాలని ఆశ...... ఆశయం. యాజులు చదవనయితే చదివాడు కానీ ఆ చివరి ఆశమీద లేదతని దృష్టి. అసలు చదువే ఆ శాఖ వైపు చూపు మళ్లనివ్వలేదు. కానీ చదవక తప్పలేదు. భౌతికశాస్త్రంలో పైపట్టా తెచ్చుకున్నాడు.

అతనికి నచ్చింది తెలుగు...తెలుగు, తెలుగు.... అది పట్టుకుందతన్ని. దాంతో తండ్రితో పోరాడి, తాతతో పోట్లాడి, తల్లి మద్దత్తుతో విడిగా విద్వాన్ పరీక్ష పూర్తిచేశాడు. నాలుగేళ్లు ఓ మహా విద్వాంసుడి యింట్లో శుశ్రూష చేసి తెలుగు సాహిత్యాన్ని పుడిసిటితో పుక్కిట పట్టాడు.

వేకువనే లేవడం, గురువు గారితో పాటే చెరువుకి వెళ్లడం, అక్కడ ఆయన గారితో పాటే స్నానం, సంధ్యావందనం ముగించుకుని, గురువు గారు తడిపి విడిచిన పంచె పిండి భుజాన వేసుకుని, దాని మీద మడినీళ్ల బిందె పెట్టుకుని, ఆయన గారితో పాటే సంత చెప్పుకుంటూ రావడం

ఇంటికి రాగానే బుద్ధిగా కావ్యామృతం సేవించి, ఆపై వ్యాకరణం ఫలహారం చేసి, ఆపై తర్కం మంచి నీళ్లలాగా పుక్కిలించేవాడు.

మధ్యాహ్నకాలైనాక గురువు గారి పాదసంవాహనం చేస్తూ, ఆయన సంస్కృత పంచకావ్యాల నుంచో,తెలుగు పంచకావ్యాల నుంచో తోచిన పద్యం తీసుకుని చదివి పద పదం వ్యాఖ్యానిస్తూ ఉంటే దాన్నలాగే మదిలో ముద్రించుకునేవాడు.

గురువు గారు నిద్రకొరిగాక అలంకార శాస్త్రం తిరిగేయడం, ఆయన సాయంకాలం తన పొలాల వెంట తిరుగుతూ అలంకార శాస్త్రం పాఠ ప్రవచనం చేసేవారు. చీకటి పడ్డాక యింటికి తిరిగొస్తూ కాళిదాసు నాటకీయతో, భారవి చమత్కార అర్థ గౌరవమో వివరించేవాడు.

రాత్రి యిక చదువు లేదు.

పుస్తకం పట్టేది లేదు పునశ్చరణే

అదీ శుశ్రూషంటే....అసలు విద్య ఎలా వస్తుందన్నారు మన పూర్వులు

శ్లో॥ గురు శుశ్రూషయా విద్యా
పుష్కలేన ధనేనిచ
అధవా విద్యయా విద్యా
చత్వారాన్నోపలభ్యతే

గురువు గారి శుశ్రూష చేసి ఆయన్ని మెప్పించి గానీ, లేదా ఆయన మనస్సు తృప్తి చెందేలా పుష్కలంగా ధనం సమర్పించుకుని కానీ, అదీ ఇదీ (అదంటే శుశ్రూష - ఇదంటే డబ్బు అన్నమాట) కాకపోతే - ఓ విద్య తను నేర్చుకుంటూ, తను నేర్చిన మరో విద్య గురువు గారికి నేర్పుతూ (అంటే ఏమన్నమాట వ్యాకరణం నేర్చాక తర్క గురువు గారి వద్దకువెళితే ఆయనతో తర్కం చదివి, ఆయనకి వ్యాకరణం చెప్పడమన్నమాట) విద్య అభ్యసించాలి. ఇదిగో చదువు నేర్చుకోడానికి ఇవీ మూడు పద్ధతులు. ఇవే పద్ధతులు. ఇవి మూడూ కాక నాలుగో పద్ధతంటూ లేనే లేదన్నారు మన వాళ్లు

గురు శుశ్రూషత కానీ తాకోరు
గురునకు ధనము కూర్చుట కానీ
మరి విద్యకు విద్యయొ కా
నీ రిత్తగ విద్యరాదు ఇతర చతుర్థిన్

అలా పన్నెండేళ్లు యిటు కావ్యాలంకార తర్క వ్యాకరణ మీమాంసలు నేరుస్తూ, వైదిక విద్యలూ కంఠతా పడుతూ, ఇటు విశ్వవిద్యాలయం వారి నుంచి స్నాతకోత్తర పట్టా పుచ్చుకున్నాడు. మరో మూడు పట్టాలూ పొందాడు.

ఆపై -

ఇప్పుడింటికి వచ్చాడు. యాజులు

ఇకనేం...మొదలైంది అన్వేషణ. అమ్మాయి కోసం అన్వేషణ.

ఆ పరిస్థితిల్లో వచ్చాడు చతుర్వేది.

చయనులు గారు చెప్పిందంతా విని- నన్నూ విషయం ఏమిటో తెలుసుకోనివ్వండి అన్నట్టు తలాడించి - యాజులు వద్దకు వచ్చాడు చతుర్వేది.

ఆ మాటా యీ మాటా అయ్యాక, మంతనాలు ముగిశాక - అసలు విషయానికి వచ్చాడు యాజులు

'నాకు నచ్చిన అమ్మాయి కనిపిస్తే, కట్నకానుకలు అక్కర్లేదు. ఇచ్చేవాళ్లిస్తే పుచ్చుకునే వాళ్ళు పుచ్చుకుంటారు. ఇవ్వకపోతే కన్యనిస్తే చాలు అనుకుంటాం అందరమూను-'

"అదేనోయ్... నీకెలాంటి అమ్మాయి కావాలో, ఎలాంటి అలక్షణవతి అయితే నచ్చుతుందో ఏమిటో నీ మదిలోని మాట మాకు వివరించాలి గా‹ అమ్మాయి విషయమైతే - పెద్దలు చెప్పారుగా -

కన్యా వరయతే రూపం, మాతా విత్తం పితా శ్రుతం
బంధూనాం గుణమిచ్ఛంతి, ఇష్టాన్న మితరే జనాః

అమ్మాయికేమో వరుడందంగా వుండాలి. అమ్మాయి తల్లికేమో అబ్బాయి ధనవంతుడై వుండాలి. అమ్మాయి తండ్రికేమో అబ్బాయి బాగా చదువుకుని వుండాలి. బంధువులకు గుణవంతుడై వుండాలి. ఇతరులకేమో పెళ్లిలో బాగా భోజనాలు పెట్టాలి. అన్నారు మరి తమ మాటేమిటో.. చెప్పండి..."

చెబుతా చెబుతా చెప్పక మాన్తానా అన్నట్టుగా తలూపి చెప్పాడు యాజులు

కన్యకు ఐదు జంఘులును, కన్యకు ఆరు కుచంబు లెన్నగా
కన్యకు నాల్గు కన్ బొమలు కన్యకు ఏడు విశాలనేత్రముల్
కన్యకు ద్వాదశంబు నులి కౌనును కల్గ సులక్షణాఢ్య కా
కన్యకు నాకు నింక పది కావలె గాఢమనోజకేళికిన్

పద్యం పూర్తయింది

'ఏమిటేమిటి? ఆశ్చర్యంగా అడిగాడు చతుర్వేది

చిరునవ్వు నవ్వుతూ మళ్లీ చదివాడు కన్యకు.....

ఆగుతూ నెమ్మదిగా పదం పదం విడదీసి చదివాడు యాజులు

బొత్తిగా అర్థం కాలేదు.

పెదవి విరిచాడు చతుర్వేది

ఎగతాళిగా నీకు అర్థం కాదులే అన్నట్టుగా చిరునవ్వు నవ్వాడు యాజులు.

లేచి నేరుగా చయనుల వద్దకు వెళ్లాడు చతుర్వేది

'ఏమిట్రా' అన్నట్టు చూశాడు చయనులు

'బాబాయ్! తమ్ముడికి కాసింత వెర్రి పట్టుకున్నట్టుంది.'

'ఏమిటేమిటి? కాస్తంత వెర్రా....చతుర్వేదీ.... నువ్వు...నువ్వు సరిగానే అంటున్నావా?'

'ఔను బాబాయ్! లేకపోతే ఏమిటి? ఐదు పిక్కలు, ఆరు కుచాలు, నాలుగు కనుబొమ్మలు, ఏడు కళ్లు, పండెండు నడుములు కలిగిన అందగత్తెతో.....మరదమేటో పది కావలెనన్నాడు'

'ఆ'

'ఆఁ బాబాయ్ ముందు వైద్యుడ్ని చూడు. తర్వాత అమ్మాయిని చూడమ్మ. గాబట్టి వైద్యుడ్ని పట్టి మహాపైత్యాంతక రసమో, మహా వాత గజసింహమో యిప్పించాల్సిందే' దిగులుగా అన్నాడు చతుర్వేది.

దిమ్మరపోయాడు చయనులు.

'ఏమిటి?' అని అడిగాడు దిగులుగా...ఁ చతుర్వేదీ! వాడేమన్నాడో చెప్పు'

యాజి చదివిన పద్యం చదివాడు అవధాని అయిన చతుర్వేది.

అతడు పద్యం చదువుతున్న వేళకు -

చయనులు గారితో ఏదో వ్యవహారం వుండి వచ్చాడు

ఆయన ఆ వూళ్లో ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడు. ఆయనా పద్యం విన్నాడు.

విని - రసవంతమైన పద్యం విన్నందుకు భళీ అని మెచ్చాడు

కానీ దిగులు పడిన చయనులు గారిని చూసి 'ఏమిటి చయనులు గారూ! మీ సమస్య ఏమిటి! మంచి పద్యం విని ఆనందించక దిగులుగా ఉన్నారేంటి?' అని అడిగాడు.

''ఏం చెప్పను శాస్త్రీ! చదువైంది! సంధ్యా అయ్యింది' ఇక సప్తపది నడిపిద్దామనుకుని ప్రయత్నిస్తే వేదుల వారి అమ్మాయినీ వద్దన్నాడు. పురాణం వారి పిల్లనూ ఊహూఁ అన్నాడు. వంకాయ వారినీ, అన్నంభొట్లువారినీ, పప్పు వారినీ, నేతి వారినీ ఎవరినీ మెచ్చటం లేదు. మనసులోని మర్మం ఏదో చెప్పడు. వీడిని విషయం కనుక్కోరా అంటే ఈః పద్యం చదివాడు అదేమిట్రా అంటే అబ్బాయికి వెర్రి ముదిరింది. మహాపైత్యాంతకం పట్టించమ బాబయ్ అంటున్నాడు. అదీ నా దిగులు నా బుగులు'

'ఓహ్ ! అదా సంగతి!'

'అవునయ్యా అదీ సంగతి! అదే సంగతి! అంత తేలిగ్గా కొట్టేస్తావేం?' అన్నాడు చయనులుగారు.

"ఏం లేదు చయనులుగారూ! కావ్యాలంకారాలు చదువుకున్న యాజులు అలంకార మర్మంగా చెప్పాడు తన అభిప్రాయాన్ని. మర్మం గ్రహించలేని చతుర్వేది అతనికి మతి చలించిదనుకున్నాడు..."

'ఏమిటేమిటి? మర్మ కవిత్వమా? గర్భ కవిత్వం విన్నాం! చతురకవిత్వం

విన్నాం, కానీ...

'ఆ కవితా మర్మం వినండి స్వామీ!

కన్యకు – అంటే అమ్మాయి కన్యాలగ్న జాతకురాలు కావాలి. ఇక అక్కడి నుంచి వర్ణించాడు చూడండి. ఆమె పిక్కలు మొసలి (మకరం) పిక్కల్లా వుండాలి. అవి పలుచగా కఠినంగా ఉంటాయి కదా! ఆమె ఉరోజాలు కుండల్లా (కుంభం) వుండాలిట. కనుబొమలు విల్లు వొంపులా (ధనస్సు) వుండాలి. కళ్లు చేపకళ్లల్లా (మీనం) వుండాలి. నడుము పిడికిటిలో ఒదిగే సింహం నడుములా (సింహం) వుండాలి. ఈ అవయవసంపద ఉన్న స్త్రీతో తనకు పెండ్లి – పది అంటే (మిధునం) పెండ్లి కావాలి. జ్యోతిషం చదువుకున్న మీ అబ్బాయి పండెండు రాసులు లెక్కించి (కన్య, తుల, వృశ్చికం, ధనస్సు, మకరం, కుంభం, మీనం, మేషం, వృషభం, మిధునం, కర్కాటకం, సింహం) రాసుల సంఖ్య గుంభనగా కవితా మయంగా నర్మ గర్భంగా చెప్పాడు.

అంతే!

సర్వావయవ లక్షణ సంపన్న అయిన స్త్రీకి నడుము సన్నంగా కనుబొమ్మలు బొమవిల్లులా కళ్లు చేపకళ్లల్లా వక్షోజాలు కుంభాకారంగా పిక్కలు మకర రూపంగా వుంటాయని శాస్త్రం శాస్త్రమే రూఢి. అదే కోరాడు అబ్బాయి.

కన్య నుంచి లెక్కించి చూడండి. కన్యకు ఐదు జంఘులు (మకరం)...కన్యకు ఆరు కుచాలు, నాలుగు కనుబొమలు, ఏడు విశాల నేత్రాలు అంటూ సంఖ్యను పరోక్షంగా రాశి లక్షణాలు చెప్పాడు. రాసుల్లో కెల్లా సౌందర్యరాశి కావాలిట స్వామీ!'

పకపక నవ్వాడు వయసులు గారు

ఆ నవ్వులో.....

పెళ్లి మంత్రాలు...పెళ్లి భజంత్రీలు ...పెళ్లి కార్యాలు ధ్వనించాయి. ఛాందసుడైన చతుర్వేదికి అంతా గమ్మత్తుగా తోచింది...

* * *